ఆగని ఇసుక దందా




అయ్యప్పరెడ్డి పాళెం, మూర్తిరెడ్డి పాళెం గ్రామాల్లో స్వర్ణముఖి నది పొర్లు కట్టలను ధ్వంసం చేసిన ఇసుకాసురులు




చిగురుపాడు, అగ్రహారం గ్రామాల్లో పొర్లు కట్టలు ధ్వంసం చేసి రోడ్డు వేసుకున్న వైనం

ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. స్వర్ణముఖి నది నిండుగా ప్రవహిస్తున్నా లెక్క చేయడం లేదు. పొర్లు కట్టలను ధ్వంసం చేసి రోడ్డు ఏర్పాటుచేసుకున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఇంటి అవసరాల పేరుతో పరిశ్రమలు, డంపింగ్ యార్డులకు తరలిస్తూ అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. వారికి అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

- స్వర్ణముఖి నది పొర్లు కట్టలు ధ్వంసం చేసి రోడ్డు ఏర్పాటు
- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- మెండుగా కూటమి నేతల అండదండలు
- పట్టించుకోని అధికారులు



మూర్తిరెడ్డి పాళెం వద్ద నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న కూలీలు

నాయుడుపేట టౌన్ : రైతుల పాలిట వరప్రసాదినిగా పేరొందిన స్వర్ణముఖి నదిని ఇసుకాసురులు ధ్వంసం చేస్తున్నారు. ఇక్కడి ఇసుక నాణ్యమైనది కావడంతో డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది నదిని చెరబట్టారు. నాయుడుపేట పట్టణ పరిధిలోని ఎల్‌ఏ సాగరం, బీడీ కాలనీ, చిగురుపాడు, తుమ్మూరు, మర్లపల్లి, అన్నమేడు, అయ్యప్పరెడ్డిపాళెం, కల్లిపేడు, మూర్తిరెడ్డి పాళెం, భీమవరం తదితర గ్రామాల సమీపంలో స్వర్ణముఖి నదిలో ఇసుకను తవ్వుతున్నారు. నదిలోకి ట్రాక్టర్లతో పాటు భారీ వాహనాలు వెళ్లేలా పొర్లు కట్టలను ధ్వంసం చేసి రోడ్డును ఏర్పాటుచేసుకున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. భారీ వర్షాలు కురిసి పెద్ద ఎత్తున వరద ప్రవాహం వస్తే గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని రోజులు అధికారులు అడపాదడపా దాడి చేసి మామూళ్లు ఇవ్వని ట్రాక్టర్లను పట్టుకున్నారు. తర్వాత చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.

ఉచితం పేరుతో యథేచ్ఛగా రవాణా

ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా తరలించుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడం అక్రమార్కులకు కలిసి వచ్చింది. అధికార పార్టీ నేతల అండదండలతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇంటి నిర్మాణానికి కొన్ని ట్రిప్పులు తరలిస్తూ అధికంగా పరిశ్రమలకు తరలిస్తున్నారు. మరి కొంతమంది డంపింగ్ యార్డుల్లో ఇసుకను నిల్వ చేస్తున్నారు. రాత్రిళ్లు లారీలు, టిప్పర్లలో చెన్నైకి పంపిస్తున్నారు. తడ ప్రాంతానికి చెందిన కొంతమంది ఇసుక స్మగర్లు నాయుడుపేటకు వచ్చి ట్రాక్టర్లలో తమిళనాడు సరిహద్దు వరకు ఇసుకను చేరవేస్తున్నారు. ఇటీవల నాయుడుపేట నుంచి తమిళనాడుకు ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శ్రీసిటీ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.




తమిళనాడు సరిహద్దుకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, ఇసుక తరలింపునకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్

చర్యలు తీసుకుంటాం

స్వర్ణముఖి నది వద్ద పొర్లు కట్టలు ధ్వంసం చేసిన విషయం మా దృష్టికి రాలేదు. నదీ పరివాహక ప్రాంతాలను పరిశీలిస్తాం. నది పొర్లు కట్టలను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతాం. స్థానిక రెవెన్యూ, పోలీసులతో కలిసి పొర్లు కట్టల వద్ద అడ్డుకట్టలు వేసి ఇసుక అక్రమ రవాణా అరికడతాం.

– ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, గూడూరు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో ఉన్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతు పనులు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్మార్ట్ కీతో చోరీలకు చెక్



స్మార్ట్ కీ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

దొరవారిసత్రం : స్మార్ట్ కీతో చోరీలకు చెక్ పెట్టవచ్చని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం ఎస్‌ఐ అజయ్‌కుమార్‌తో కలిసి దొరవారిసత్రం పోలీస్ స్టేషన్ వద్ద పలు గ్రామాల్లోని ఆలయాల కమిటీ సభ్యులకు చోరీలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆలయాలు, ఇళ్లలో చోరీలు జరగకుండా స్మార్ట్ కీని వినియోగించాలన్నారు. వాటిని దుండగులు పగులగొట్టినా, తాకినా సైరన్ వినిపిస్తుందన్నారు. దీంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా దుండగులను పట్టుకోవచ్చని చెప్పారు. ఇళ్లకు స్మార్ట్ కీ వేయడం వల్ల చోరీలను నియంత్రించవచ్చన్నారు.

పిల్లలకు అర్థమయ్యేలా బోధన ఉండాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈవో

డక్కిలి : విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన శుక్రవారం ఎగులింగసముద్రం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతి విద్యార్థీ వర్క్ బుక్ పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సూళ్లూరుపేట : రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.3,580 కోట్లను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏబీవీపీ) తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి తేరే సూర్య కోరారు. ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రెండు సమస్యలపై శనివారం ఉదయం 10.30 గంటలకు సూళ్లూరుపేట బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలపనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

కోట : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు లక్ష్యమని రీజనల్ మేనేజర్ టి.మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కోట బ్రాంచ్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకుకు సంబంధించి తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో 68 బ్రాంచులు ఉన్నాయన్నారు. వాటిలో ప్రత్యేక డిపాజిట్ పథకాలను అమలుచేస్తున్నామని చెప్పారు. దేశంలోని ఇతర గ్రామీణ బ్యాంకుల కంటే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సదుపాయాలను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. కార్యక్రమంలో కోట బ్రాంచ్ మేనేజర్ రజని, శ్రీనివాసులు, నితిన్‌సాయి పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం, అమరాగార్డెన్ వీధిలో శుక్రవారం సాయంత్రం కుటుంబ కలహాలతో గుత్తుల చిరంజీవి(43) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిరంజీవి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతను చెడు వ్యసనాలకు బానిసై పలుచోట్ల అప్పులు చేశాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితం మీద విరక్తి చెందిన చిరంజీవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు అతన్ని కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ బాబి వెల్లడించారు.

స్వర్ణముఖి నదిలో కొట్టుకొచ్చిన అస్థి పంజరం

నాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నదిలో శుక్రవారం సాయంత్రం ఒక అస్థి పంజరం కొట్టుకువచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. నదిలో పూడ్చిపెట్టిన మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు అస్థి పంజరాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నీటిని కిందకు వదలొద్దని రైతుల ఆందోళన



కల్లూరు చెరువు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

వాకాడు : మండలంలోని కల్లూరు చెరువు నుంచి వరద నీటిని దిగువ ప్రాంతానికి వదలొద్దని రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్లూరు చెరువు నిండిందన్నారు. సామర్థ్యానికి మించి నీరు చేరడంతో నీటిని అవసరం లేకున్నా దిగువ ప్రాంతానికి వదులుతున్నారని పేర్కొన్నారు. దీంతో చెరువు కింద ఉన్న సుమారు 300 ఎకరాల పంట పొలాలు 20 రోజులుగా నీట మునిగిపోయాయని, నారుమడులు పాచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదును దాటిపోతున్నా వరినాట్లు వేసుకోలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రతి చెరువూ నిండి కలుజులు పారుతున్నాయని పేర్కొన్నారు. కొంతమంది నాయకుల అండతో ఇరిగేషన్ అధికారులు అత్యుత్సాహం చూపుతూ కల్లూరు చెరువు నుంచి దిగువ ప్రాంతానికి నీరు వదలడం దారుణమన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని కల్లూరు చెరువు నీటిని వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న ఇరిగేషన్ అధికారులు అక్కడికి చేరుకుని చెరువు కింద ఉన్న పంట పొలాలను పరిశీలించారు.

ఘనంగా గోదాదేవి క్షేత్రోత్సవం



గోదాదేవి క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

రాపూరు : మండలంలోని పెంచలకోనలో శుక్రవారం గోదాదేవి క్షేత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవికి నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మొదటి శుక్రవారం గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని తిరుచ్చిపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించి మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కోన మాఢ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి తిరుప్పావై, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉభయకర్తలుగా మధుస్వామి, సువర్ణలక్ష్మి వ్యవహరించారు.

23న గూడూరులో డివిజన్ స్థాయి గ్రీవెన్స్ డే



సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

చిల్లకూరు : గూడూరు డివిజన్‌లోని 8 మండలాల ప్రజల కోసం ఈ నెల 23న గూడూరులో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సోమవారమూ కలెక్టర్, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే గూడూరు డివిజన్‌లోని 8 మండలాల ప్రజల కోసం సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఇందులో కలెక్టర్ వెంకటేశ్వర్లుతోపాటు జిల్లా స్థాయి, మండలాల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

10 మద్యం బాటిళ్ల స్వాధీనం

చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలంలోని మొలకలపూడి గ్రామంలో శుక్రవారం బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. విచ్చల విడిగా బెల్టు షాపులు అన్న శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. మొలకలపూడి గ్రామంలో చంద్రశేఖర్ బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరు సమీపంలోని శారదానగర్‌లో ఉన్న లిటిల్ ఏంజిల్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్సు, సోషల్ ఎగ్జిబిట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపకరిస్తాయని ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి తెలిపారు. 4వ తరగతికి చెందిన అశ్రిన్, ఆరోన్ రూపొందించిన సూర్యరశ్మితో విద్యుత్ ఉత్పత్తిని తెలిపే నమూనాలు ఆకట్టుకున్నాయి. వారిని పలువురు అభినందించారు.

కండలేరులో 56.744 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 56.744 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు వరద కాలువ ద్వారా 600 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 830, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

22, 23 తేదీల్లో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహా సభ

నాయుడుపేట టౌన్ : తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఈ నెల 22, 23 తేదీల్లో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహా సభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. వారు శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. మహాసభలకు నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు రామమూర్తి, రాజులు, కె.సుబ్బారావు, గోవర్ధన్‌రెడ్డి, వాసు, శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెంచమ్మకు విశేష పూజలు

డక్కిలి : మండలంలోని ఆముదూరు పంచాయతీ వెలుగొండలు కింద కొలితోటలో వెలసిన విష్ణుమూర్తి సమేత చెంచమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు.

నేడు జగనన్న జన్మదిన వేడుకలు

సైదాపురం/ పెళ్లకూరు/నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ సైదాపురం మండల కన్వీనర్ ఎం.రవికుమార్ యాదవ్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, నాయుడుపేట మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. సైదాపురం మండలం మర్లపూడిలో జరిగే వేడుకల్లో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నాయుడుపేటలో జరిగే వేడుకల్లో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొంటారని తెలిపారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేస్తారని పేర్కొన్నారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అన్నదానం చేస్తామని వెల్లడించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు గుడ్డ సంచుల పంపిణీ

కోట : మండలంలోని గోవిందపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ప్రతినిధులు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. సంస్థ అధ్యక్షుడు అనంతాచార్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందన్నారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో గుడ్డ సంచులు వాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు గుడ్డ సంచులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గిరిబాబు, క్రిష్ణ ప్రసాదాచార్యులు, సుబ్బారావు, సుజాత, లక్ష్మీ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కోట : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. కోటలోని ప్రగతి డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ కిషోర్, ఎస్‌ఐ బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాల్సిందే



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బహుజన ఐక్యవేదిక నాయకులు

నాయుడుపేట టౌన్ : కొంతమంది బీఆర్ అంబేడ్కర్ పేరు ఉచ్చరించడం ఫ్యాషన్‌గా మారిందని, దేవుడి పేరును జపిస్తే పుణ్యమైనా లభిస్తుందని అంబేడ్కర్‌ను కించపరుస్తూ కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడడం తగదని బహుజన ఐక్యవేదిక నాయకులు తెలిపారు. వారు శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు పొందిన అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కేంద్ర మంత్రి తీరును నిరసిస్తూ పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో బామ్‌సేఫ్, బీఎస్పీ, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నేదురుమల్లి, కాకాణి

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి పట్టణంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి అనీల్‌కుమార్‌యాదవ్, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు జెడ్పీ చైర్మన్ అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అవుట్ పోస్టు కోసం వినతి



డీఎస్పీ చెంచుబాబుతో మాట్లాడుతున్న పరిశ్రమల ప్రతినిధులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండల పరిధిలోని మేనకూరు సెజ్ వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని పలు పరిశ్రమల ప్రతినిధులు కోరారు. వారు శుక్రవారం డీఎస్పీ చెంచుబాబుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మేనకూరులో అనేక పరిశ్రమలు ఏర్పాటైనట్టు తెలిపారు. కొత్త పరిశ్రమలను ఏర్పాటుచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో పరిశ్రమల వద్ద తరచూ చోరీలతోపాటు కార్మికులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడులకు పాల్పడుతున్నారని వెల్లడించారు. పరిశ్రమల్లో విధుల్లో పాల్గొనేందుకు 24 గంటలూ కార్మికులు ఒంటరిగా వస్తుంటారని, వారికి భద్రత కల్పించాలని కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్ : మద్యం సేవించవద్దని వారించిన భార్యపై కోపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేటలోని చిన్నదర్గా వీధికి చెందిన షేక్ మీరా మొహిద్దీన్(60) మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని భార్య అతన్ని మందలించింది. ఈ క్రమంలో ఈ నెల 15న అతను భార్యపై కోపంతో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాల, అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సదస్సుల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

సైదాపురం : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండలంలోని పెరుమాళ్లపాడు, ఓరుపల్లి గ్రామాల్లో సర్పంచ్ నంది మండలం గీతా అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు, ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూములకు పట్టాలు ఇప్పించాలని వినతి

డక్కిలి : తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని మాటుమడుగు గ్రామస్తులు కోరారు. మండలంలోని మాటుమడుగులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాటుమడుగు దళితవాడకి చెందిన పేదలు 84 ఎకరాలు, గిరిజన కాలనీకి చెందిన పేదలు 40 ఎకరాల భూములను సాగు చేసుకుంటున్నట్టు తెలిపారు. వాటికి హక్కులు కల్పించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, అర్హులైన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సర్వేయర్ రాజగోపాల్, వీఆర్వో ఆమణి, ఏఎస్‌ఓ వెంకటయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు ఐదు అర్జీలు

పెళ్లకూరు : మండలంలోని నందిమాలలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఐదు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. వాటిలో పక్కా ఇళ్ల కోసం మూడు, వన్‌బీ కోసం రెండు అర్జీలు ఉన్నట్టు తెలిపారు. గ్రామంలోని మట్టి, గ్రావెల్‌ను పరిశ్రమలు, వెంచర్లకు తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చిల్లకూరులో..

చిల్లకూరు : రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం చిల్లకూరు మండలం చింతవరం, గూడూరు మండలం గాంధీనగర్‌లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, చిల్లకూరు, గూడూరు తహసీల్దార్లు శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.